
ఆంధ్రజ్యోతి
andhrajyothy.com శుక్రవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 37.0, కనిష్ఠం 21.8



రంజాన్ వేళలు

శనివారం	ఆదివారం
ఇఫ్తార్ :	సహర్ :
సా. 6.34	ఉ. 4.55

ఉపవాసికి (ఇఫ్తార్) దీక్షవిరమణ చేయించిన వారికి సైతం ఉపవాసికి లభించినంత పుణ్యం లభిస్తుంది





కాంగ్రెస్ టికెట్ ఎవరికో?

నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థిపై వీడని ఉత్కంఠ

నిజామాబాద్ లోక్‌సభ స్థానానికి పోటీ చేసే కాంగ్రెస్ అభ్యర్థిని పార్టీ అధిష్ఠానం ఇంకా ప్రకటించకపోవడంతో ఆశావహుల్లో ఉత్కంఠ నెలకొంది. టికెట్ కేటాయింపుపై పార్టీ నేతల్లో చర్చ మొదలైంది. ఈ సారి ఎలాగైనా కాంగ్రెస్ జెండా ఎగరాల్సిందేనని పార్టీ అధిష్ఠానం యోచిస్తోంది. దీంతో బలమైన నేతను దింపేందుకు కసరత్తు చేస్తోంది.

- ఎవరికి అవకాశం దక్కుతుందోనని పార్టీ నేతల చర్చ
- జీవన్‌రెడ్డివైపే మొగ్గు చూపుతున్న పార్టీ అధిష్ఠానం
- మరికొంత మంది పేర్లను కూడా పరిశీలించిన ఏఐసీసీ నేతలు
- ప్రచారాన్ని మొదలు పెట్టిన బీజేపీ, బీఆర్ఎస్ అభ్యర్థులు

నిజామాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): నిజామాబాద్ పార్లమెంట్ కాంగ్రెస్ అభ్యర్థి ఎంపికపై ఉత్కంఠ వీడటం లేదు. ఇప్పటికే పలు నియోజకవర్గాలకు అభ్యర్థులను ప్రకటించిన నిజామాబాద్ పెండింగ్‌లో పెట్టడంతో క్యాడర్‌లో చర్చలు మొదలయ్యాయి. ఈ దఫా ఓసీ అభ్యర్థుల వైపే మొగ్గు చూపుతుండటంతో బీసీ నేతలు కూడా ప్రయత్నాలు చేస్తున్నారు. పార్లమెంట్ పరిధిలోని స్థానికులకే టికెట్ కేటాయించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఏఐసీసీ నేతలు నిర్ణయం తీసుకోనుండటంతో తమవంతు ప్రయత్నాలను చేస్తున్నారు. రాష్ట్రంలో ఎక్కువ సీట్లు గెలవాలనే తలంపుతో ఉన్న పార్టీ నేతలు బలమైన అభ్యర్థిని బరిలోకి దింపేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది. జగిత్యాలకు చెందిన ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డివైపే నేతలందరూ మొగ్గు చూపుతున్నారు. బీజేపీ, బీఆర్ఎస్ బీసీ అభ్యర్థులకు టికెట్ ఇవ్వడంతో అన్ని సమీకరణాలు పరిశీలించి అభ్యర్థిని నిర్ణయించనున్నట్లు పార్టీ నేతలు భావిస్తున్నారు.

బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్

పార్లమెంట్ బీజేపీ అభ్యర్థిగా సిట్టింగ్ ఎంపీ అర్వింద్‌ను ప్రకటించగా, బీఆర్ఎస్ అభ్యర్థిగా మాజీ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ప్రకటించారు. ఇద్దరు అభ్యర్థులు పార్లమెంట్ పరిధిలో పర్యటిస్తున్నారు. క్యాడర్‌తో సమావేశాలు నిర్వహిస్తూనే ప్రచారాలను కొనసాగిస్తున్నారు. ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ సీనియర్ నేతలను కలుపుకొని కార్యక్రమాల్లో పాల్గొంటున్నారు. ఎవరికి వారే గట్టిగా ప్రచారం నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. మే 13న పోలింగ్ జరుగనుండటంతో సమయం 50 రోజుల వరకు ఉండటంతో ఏడు నియోజకవర్గాల పరిధిలో కార్యక్రమాలను నిర్వహించేందుకు సిద్ధమవుతున్నారు. గ్రామ, మండల స్థాయి నేతలందరిని కలుపుకొని ముందుకు వెళ్లేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

ప్రచారం మొదలు పెట్టని కాంగ్రెస్

కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిని ప్రకటించకపోవడం వల్ల ఇంకా ప్రచారాలను మొదలు పెట్టడం లేదు. ఎమ్మెల్యేలు నియోజకవర్గాల్లో తిరుగుతున్నా అధికారిక కార్యక్రమాల్లోనే పాల్గొంటున్నారు. క్యాడర్ బలోపేతంపై నజర్ పెట్టి ఇతర పార్టీల వారిని చేర్చుకుంటున్నారు. క్యాడర్‌లో మాత్రం అభ్యర్థి ఎంపికపైన ఉత్కంఠ నెలకొంది. పార్లమెంట్ పరిధిలో ఈ దఫా గెలిచే అభ్యర్థికి టికెట్ ఇవ్వాలని అధిష్ఠానం నిర్ణయించింది. ఏఐసీసీ ఎంపిక కమిటీ ఆధ్వర్యంలో నిజామాబాద్ పార్లమెంట్ అభ్యర్థిని కూడా ఎంపిక చేయనున్నారు. ఇప్పటికే పలు దఫాలు చర్చించిన పార్టీ నేతలు ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డివైపే మొగ్గు చూపుతున్నట్లు తెలిసింది. ఆయనను కరీంనగర్‌లో పోటీ చేయాలని కోరిన ఆయన నిజామాబాద్ వైపే మొగ్గుచూపినట్లు సమాచారం. తన నియోజకవర్గం నిజామాబాద్ పార్లమెంట్‌లో ఉన్నందున కరీంనగర్‌లో పోటీ చేయనని చెప్పినట్లు తెలుస్తోంది. నియోజకవర్గం ఉన్న పార్లమెంట్ పరిధిలో పోటీ చేస్తే తనకు అవకాశం ఉంటుందని కరీంనగర్‌కు బదులు నిజామాబాద్ ఇవ్వాలని ఆయన అధిష్ఠానానికి విజ్ఞప్తి చేసినట్లు పార్టీ వర్గాల ద్వారా తెలిసింది. ఆయనతో పాటు దిల్ రాజ్ సోదరుడు నర్సింహారెడ్డి, సునీల్‌రెడ్డి, డాక్టర్ కవితారెడ్డి అభ్యర్థిత్వాలను కూడా పరిశీలించినట్లు తెలుస్తోంది. వీరితో పాటు మాజీ ఎమ్మెల్సీ అరికెల నర్సారెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలించిన జీవన్‌రెడ్డివైపే మొగ్గుచూపినట్లు సమాచారం. వీరిలో కవితారెడ్డి మినహా ముగ్గురు స్థానికులైన గతంలో మంత్రిగా పలు దఫాలు ఎమ్మెల్యేలుగా జీవన్‌రెడ్డి చేసి ఉండటం వల్ల ఆయనకే అధిష్ఠానం కేటాయించే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది. డాక్టర్ కవితారెడ్డి అభ్యర్థిత్వాన్ని పరిశీలించిన నాన్‌లోకల్ కావడం వల్ల వెనకడుగు వేస్తున్నట్లు సమాచారం. వీరితో పాటు బీసీ అభ్యర్థుల జాబితాను కూడా పరిశీలించినట్లు తెలిసింది. రెండు పార్టీలు బీసీ అభ్య ర్థులకే ఇవ్వడం వల్ల మాజీ విప్ ఈరవత్రి అనిల్‌తో పాటు మాజీ ఎమ్మెల్సీ ఆకుల లలిత అభ్యర్థిత్వాన్ని పరిశీలించినట్లు పార్టీ నేతల ద్వారా తెలుస్తోంది. జహీరాబాద్ బీసీలకు కేటాయించడం వల్ల నిజామాబాద్ ఓసీ అభ్యర్థులకే కేటాయించనున్నట్లు సమాచారం. కరీంనగర్ పార్లమెంట్ అభ్యర్థి ఎంపికతో పాటు నిజామాబాద్ అభ్యర్థిని ఎంపిక చేయనున్నట్లు పార్టీ నేతలు తెలిపారు. మూడో దఫా ప్రకటించే జాబితాలో పార్లమెంట్ అభ్యర్థిని ప్రకటించనున్నారు. పార్టీ నేతలు మాత్రం ఎప్పటికప్పుడు వివరాలను తెలుసుకోవడంతో పాటు ఏ అభ్యర్థి అయితే బాగుంటుందోనని చర్చించుకుంటున్నారు.

'పార్లమెంట్ ఎన్నికలకు సిద్ధం కావాలి'

నిజామాబాద్ రూరల్, మార్చి 22: పార్లమెంట్ ఎన్నికలకు బీఆర్ఎస్ శ్రేణులంతా సిద్ధం కావాలని రూరల్ మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ పిలుపునిచ్చారు. గురువారం జిల్లా కేంద్రంలోని బాజిరెడ్డి నివాసంలో రూరల్ నేతలు కలిసి సమాలోచనలు చేశారు. రూరల్, మోపాల్ మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, మండల పార్టీ అధ్యక్షులు, మైనార్టీ నేతలు బాజిరెడ్డిని కలిసి గంటపాటు సమావేశమయ్యారు. బీఆర్ఎస్ హయాం లో చేసిన పనులు గుర్తుచేస్తూ, కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చిన తర్వాత ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రజలకు వివరించాలని సూచించారు. రూరల్ నుంచి కొంతమంది సన్నిహితులు పార్టీవీడినా పెద్ద నష్టం లేదని, ఉన్నవారితోనే గట్టిగా పనిచేయాలని తాను ఎన్నికలయ్యేవరకు జిల్లా కేంద్రంలోనే అందు బాటులో ఉంటానని బాజిరెడ్డి హామీ ఇచ్చారు.



సీఎం రేవంత్‌రెడ్డికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న కాంగ్రెస్ నాయకులు

సీఎంను కలిసిన జిల్లా నాయకులు

నిజామాబాద్ అర్బన్, మార్చి 22: సీఎం రేవంత్‌రెడ్డిని జిల్లాకు చెందిన నాయకులు శుక్రవారం హైదరాబాద్‌లో మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లాకు చెందిన మాజీ మంత్రి, బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి, ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీ, ఇన్‌చార్జి మంత్రి జూపల్లి కృష్ణారావు, కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు, రాష్ట్ర కోఆపరేటివ్ యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డిలు సీఎంను కలిశారు. తనను రాష్ట్ర చైర్మన్‌గా నియమించినందుకు మానాల మోహన్‌రెడ్డి సీఎంకు ధన్యవాదాలు తెలిపారు. రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి దీప్‌దాస్ మున్షి, ఏఐసీసీ కార్యదర్శి రోహిత్ చౌదరీ, మహేష్‌కుమార్‌గౌడ్, మధుయాష్కి తదితరులను మానాల మోహన్‌రెడ్డి తదితరులు కలిసి ధన్యవాదాలు తెలిపారు.

పసుపు బోర్డును చూపించి ఓట్లు అడగాలి

- ఓట్ల కోసమే నిజాంషుగర్ ఫ్యాక్టరీ బాండ్ పేపర్ డ్రామా
- బీఆర్ఎస్ పార్లమెంటరీ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్



బాజిరెడ్డి గోవర్ధన్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

సుభాష్‌నగర్, మార్చి 22: పసుపు బోర్డు ఎక్కడ ఏర్పాటు చేశారో చూపించి ప్రజలను ఓట్లు అడగాలని ఎంపీ అర్వింద్‌ను మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పార్లమెంట్ అభ్యర్థి బాజిరెడ్డి గోవర్ధన్ ప్రశ్నించారు. జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎంపీ అర్వింద్ ఓట్ల కోసమే నిజాం షుగర్ ఫ్యాక్టరీ బాండ్ పేపర్ డ్రామా ఆడుతున్నారని విమర్శించారు. పసుపు బోర్డు పేరుతో ఎంపీ రైతులను మోసం చేశారన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్, బీజేపీల మధ్య ప్రధాన పోటీ ఉంటుందన్నారు. ఎంపీగా గెలవకముందు షుగర్ ఫ్యాక్టరీ తెరిపిస్తానని పాదయాత్ర చేశారని, గెలిచిన తర్వాత ఫ్యాక్టరీని ప్రైవేటు భాగస్వామ్యంతో తెరిపిస్తానని హామీ ఇచ్చి చెరకు రైతులను అర్వింద్ మోసం చేశారన్నారు. అరవింద్, బండి సంజయ్ లాంటి వారు ఓడిపోవాలని ప్రజలు భావిస్తున్నారన్నారు. పసుపు రేటు పెరుగుదలలో బీజేపీ ప్రమేయం లేదన్నారు. అర్వింద్ ఎంపీగా లేనప్పుడే పసుపు ధర రూ.17వేలు పలికిందని బాజిరెడ్డి గోవర్ధన్ అన్నారు. అనంతరం బాజిరెడ్డిని పలువురు బీఆర్ఎస్ నాయకులు కలిసి సన్మానించారు.

ఎకరాకు రూ.25 వేలు చెల్లించాలి

- ఫసల్ బీమా యోజనపై రాష్ట్ర ప్రభుత్వానికి నిర్లక్ష్యం తగదు
- ఎంపీ ధర్మపురి అర్వింద్



ఎడపల్లి మండలం పోచారంలో నేలకొరిగిన పంటలను పరిశీలిస్తున్న ఎంపీ అర్వింద్

ఎడపల్లి, మార్చి 22: జిల్లాలో ఇటీవల కురిసిన వడగండ్ల వానతో పంట నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25 వేల పరిహారం అందించాలని నిజామాబాద్ ఎంపీ అర్వింద్ డిమాండ్ చేశారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా ఎడపల్లి మండలంలోని పోచారం గ్రామ శివారులో గత శనివారం కురిసిన వడగండ్ల వానకు నష్టపోయిన వరి పొలాలను ఆయన పరిశీలించి రైతులతో మాట్లాడారు. అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ప్రకృతి విపత్తులతో పంట నష్టం జరిగినపుడు రైతులకు కొంత ఊరట నిచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన ఫసల్ బీమా యోజన పథకంపై నాటి బీఆర్ఎస్, నేటి కాంగ్రెస్ ప్రభుత్వాలు అవలంబిస్తున్న నిర్లక్ష్య వైఖరిని ఎంపీ ధర్మపురి అర్వింద్ తప్పు బట్టారు. పదేళ్లపాటు అధికారంలో ఉన్న బీఆర్ఎస్ ఎన్నడూ రైతాంగాన్ని పట్టించుకోలేదన్నారు. జాతీయ స్థాయిలో ఫసల్ బీమా పథకం దాదాపు 90 శాతం రాష్ట్రాల్లో ఆచరణలో ఉన్నా, తెలంగాణలో కేసీఆర్ ప్రభుత్వం నిర్లక్ష్యం వల్ల రైతాంగానికి ఫసల్ బీమా లేకుండా పోయిందన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టి నాలుగు నెలలైనా ఫసల్ బీమాను పెడతామని దానిని నేటి వరకు అమలు చేయలేదన్నారు. ఓట్ల కోసం మేనిఫెస్టోలు, ఎన్నికలు కాగానే ఎగ్గొట్టుడు, మళ్లీ ఐదేళ్లకు వస్తే వస్తం.. లేకుంటే లేదనుకుని సంపాదించుకోవాలి, దోచుకోవాలి అనే రీతిలో ప్రభుత్వాలు ఉన్నాయన్నారు. జిల్లాలో ఎడపల్లి, రెంజల్, ఇందల్వాయి, ధర్పల్లి, సిరికొండ, మాక్లూర్ మండలాల్లో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లిందన్నారు. ఫసల్ బీమా అమలులో లేనందున పెద్ద ఎత్తున నష్ట పరిహారం చెల్లించాల్సి బాధ్యత ప్రభుత్వంపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మేడపాటి ప్రకాష్ రెడ్డి, వడ్డీ మోహన్ రెడ్డి, బోధన్ నియోజకవర్గ కన్వీనర్ కూరెళ్ల శ్రీధర్, రెంజల్ జడ్పీటీసీ మేక విజయ సంతోష్, రెంజల్ ఎంపీపీ రజనీ కిషోర్, పార్టీ మండల అధ్యక్షుడు కోల ఇంద్రకరణ్ ఉన్నారు.

హిందూ వాహిని ధ్వజస్తంభం పరిశీలన

రెంజల్: మండలంలోని నీలా గ్రామంలో నిర్మిస్తున్న హిందూ వాహిని ధ్వజస్తంభ నిర్మాణాన్ని ఇతర వర్గానికి చెందిన వారు అడ్డుకోవడంతో పనులు అర్ధంతరంగా నిలిచిపోయాయి. దీంతో శుక్రవారం నీలాలోని హిందూ వాహిని ధ్వజస్తంభాన్ని ఆయన పరిశీలించారు. ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ధ్వజస్తంభాన్ని కొందరు అడ్డుకోవడం సమంజసం కాదని ఏదైనా సమస్యలు ఉంటే సామరస్యంగా పరిష్కరించుకోవాలని సూచించారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

మండలంలోని దూపల్లి గ్రామానికి చెందిన సుదర్శన్ యాదవ్ అనారోగ్యానికి గురవడంతో శుక్రవారం ఆయన నివాసానికి వెళ్లిన ఎంపీ పరామర్శించారు. మెరుగైన చికిత్సను అందించేందుకు సహాయం అందిస్తానని కుటుంబానికి ధైర్యం చెప్పారు.



ధాన్యం వ్యాపారుల సిండికేట్!



వారం రోజుల్లో క్వింటా రూ.300 పైగా తగ్గిన ధాన్యం ధర

- వ్యాపారుల సిండికేట్‌తో తగ్గుతున్న ధరలు
- కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయని సర్కారు
- సన్న రకాలకు మద్దతు ధరకు మించి పెట్టాలంటున్న రైతులు

నిజామాబాద్, మార్చి 22 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): ఆరుగాలం కష్టపడి ధాన్యం పండించిన రైతులకు గిట్టుబాటు కావడం లేదు. ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఇంకా ఏర్పాటు చేయకపోవడంతో వ్యాపారులు, మిల్లర్లు సిండికేట్‌గా ఏర్పడి తక్కువ రేటుకు ధాన్యం కొనుగోలు చేస్తున్నారు. సన్నరకాలకు డిమాండ్ ఉన్నా భారీగా ధర తగ్గిస్తున్నారు. మద్దతు ధర కంటే తక్కువ ధరకే కొనుగోలు చేస్తుండటంతో రైతులు నష్టపోతున్నారు. జిల్లాతో పాటు ఇతర జిల్లాలు, కర్నాటకలోని రాయచూర్, బల్లారి, ఏపీలోని కర్నూల్ ఇతర ప్రాంతాల నుంచి వ్యాపారులు వచ్చి ధాన్యం కొనుగోలు చేస్తున్నా ధర పెట్టడం లేదు. కొనుగోలు కేంద్రాలు లేకపోవడం వల్ల తక్కువ ధరకే కొంటున్నారు. క్వింటాలుకు ఐదు కిలోల తరుగును తీస్తున్నారు.

అత్యధికంగా వరిసాగు

జిల్లాలో ఈ యాసంగిలో అత్యధికంగా వరిసాగు చేశారు. జిల్లాలోని అన్ని మండలాల పరిధిలో 4లక్షల 6వేల ఎకరాలకు పైగా ఈ దఫా సాగు చేశారు. బోధన్ డివిజన్‌తో పాటు నిజామాబాద్ రూరల్ నియోజకవర్గం పరిధిలో రైతులు ముందే నాట్లను వేశారు. నవంబర్ చివరన డిసెంబర్ నెలలో వరినాట్లు వేసిన రైతులు గత 15 రోజులుగా కోతలు మొదలు పెట్టారు. ధాన్యాన్ని అమ్మకాలు చేస్తున్నారు. వర్షాలు ఉండటం వల్ల ఆర బోసి నిలువ చేసేందుకు అవకాశాలు లేకపోవడంతో ఎక్కువ మొత్తంలో రైతులు తమ ధాన్యాన్ని వ్యాపారులకు అమ్మకాలు చేస్తున్నారు. జిల్లాలో వర్ని, రుద్రూర్, మోస్రా, చందూర్, ఎడపల్లి, బోధన్‌తో పాటు ఇతర మండలాల్లో రైతులు ఎక్కువగా సన్నరకాలను సాగు చేశారు. గంగా కావేరి, సోనమసూరి, హెచ్ఎంటీ, జైశ్రీరాంతో పాటు ఇతర రకాలను వేశారు. వరి చేతికి రావడంతో 15 రోజులుగా వరి కోతలను చేస్తున్నారు.

కోతలకు పెరిగిన ఖర్చులు..

రైతులు వరి కోతలకు కూడా భారీగా ఖర్చు చేస్తున్నారు. ఎకరాకు గంటకు హార్వెస్టర్‌కు 2700 రూపాయలను చెల్లిస్తున్నారు. ఇవేకాకుండా ట్రాక్టర్‌కు ధాన్యం తరలించేందుకు 650 రూపాయలు ఒక ట్రిప్పుకు వెచ్చిస్తున్నారు. వ్యాపారులు ధర తగ్గించడం ఖర్చు పెరగడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయని రైతులు వాపోతున్నారు.

కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలి..

: పెద్దమౌలానా, రైతు (అంభం)



ధాన్యం కోతలు జరుగుతున్నాయి. అకాల వర్షాలు పడుతున్నాయి. వ్యాపారులు ధరలు తక్కువ పెడుతున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు కొనుగోలు చేయాలి. కోసిన ధాన్యం నిలువ చేసే పరిస్థితులు లేవు. ప్రభుత్వం వెంటనే నిర్ణయం తీసుకొని కొనుగోలు ప్రారంభించాలి.

లోడ్ ధాన్యం ఉంటేనే కొనుగోలు చేస్తున్నరు..

: సాయిలు, రైతు, (వర్ని)



వ్యాపారులు సన్న, చిన్నకారు రైతుల ధాన్యం కొనుగోలు చేయడం లేదు. లారీ లోడ్ అయ్యే పెద్ద రైతుల ధాన్యాన్నే కొనుగోలు చేస్తున్నారు. చిన్న రైతులు వరికోతలు పూర్తి చేసిన ధాన్యం అమ్మే పరిస్థితి లేదు. వ్యాపారులు ధర తగ్గించడం వల్ల ఇబ్బందులు ఎదురవుతున్నాయి.

జిల్లాకు వ్యాపారుల రాక

వరి కోతలు మొదలు పెట్టగానే వ్యాపారులు కొనుగోలు కోసం జిల్లాకు వచ్చారు. జిల్లాలోని వ్యాపారులతో పాటు సూర్యపేట, మిర్యాలగూడ, హైదరాబాద్, కర్నూల్‌తోపాటు కర్నాటకలోని బల్లారి, రాయచూర్ వ్యాపారులు కూడా వచ్చి కొనుగోలు చేస్తున్నారు. వారం క్రితం ధాన్యానికి క్వింటా రూ.2300 వరకు ధర పెట్టి కొనుగోలు చేయగా ప్రస్తుతం క్వింటా రూ.1900 నుంచి 2వేల మధ్యనే కొనుగోలు చేస్తున్నారు. ప్రతీ 70 కిలోల బస్తాకు మూడు కిలోల వరకు తరుగు తీస్తున్నారు. క్వింటాలుకు ఐదు కిలోల చొప్పున తరుగు తీస్తూ కొనుగోలు చేస్తున్నారు. ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయకపోవడం వల్ల సన్నరకాలకు బయట డిమాండ్ ఉన్నా వ్యాపారులు ధర పెట్టడం లేదు. అవసరాల రిత్యా తమకే అమ్ముతారని భావిస్తున్న వ్యాపారులు సిండికేట్‌గా మారి వారు నిర్ణయించిన రేటుకే కొనుగోలు చేస్తున్నారు. వారం రోజుల్లోనే క్వింటాలుకు 400 వరకు ధర తగ్గడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేసి మద్దతు ధరకు ధాన్యాన్ని కొనుగోలు చేయాలని రైతులు కోరుతున్నారు.

పంట నష్టంపై మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు

- రైతాంగాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఆదుకుంటుంది
- రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్ అన్వేష్‌రెడ్డి

నిజామాబాద్ అర్బన్, మార్చి 22: రాష్ట్రంలో అకాల వర్షాల వల్ల నష్టపోయిన రైతాంగాన్ని ఆదుకునేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందని పంట నష్టంపై విమర్శలు చేస్తున్న బీఆర్ఎస్ నేతలకు రైతుల గురించి మాట్లాడే అర్హత లేదని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్థ చైర్మన్, రాష్ట్ర కిసాన్ కాంగ్రెస్ చైర్మన్ అన్వేష్‌రెడ్డి అన్నారు. శుక్రవారం జిల్లా కాంగ్రెస్ కార్యాలయంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్‌బిన్ హందాన్‌తో కలిసి విలేకరుల సమావేశం నిర్వహించారు. దేశంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఉన్న తెలంగాణ రాష్ట్రంలోనే గతంలో పంట బీమా పథకాన్ని అమలు చేయలేదని దానివల్ల ఎంతో మంది రైతులు నష్టపోయారన్నారు. పదేళ్ల పాటు రైతాంగాన్ని నిర్లక్ష్యం చేసిన బీఆర్ఎస్ పార్టీ నేతలు పంట నష్టపరిహారంపై మాట్లాడటం హంతకులే



సమావేశంలో మాట్లాడుతున్న అన్వేష్‌రెడ్డి

సంతాప సభ పెట్టినట్లుగా ఉందని ఎద్దేవా చేశారు. గతంలో 25లక్షల ఎకరాల్లో పంటనష్టం జరిగితే నయా పైసా ఇవ్వలేదని, రైతులు హైకోర్టును ఆశ్రయిస్తే హైకోర్టుకు 7,219 కోట్ల పంటనష్టం జరిగిందని చెప్పిన బీఆర్ఎస్ ప్రభుత్వం ఒక్కపైసా కూడా రైతులకు ఇవ్వలేదన్నారు. కేంద్రం నుంచి వచ్చిన 1500 కోట్ల పంట నష్టాన్ని పంపిణీ చేయలేదన్నారు. సీఎంగా తొమ్మిదేళ్ల పాటు పని చేసిన కేసీఆర్ ఏ ఒక్కరోజు కూడా పంటనష్టాన్ని పరిశీలించలేదని కేవలం అధికారంలోకి వచ్చి మూడు నెలల కాలంలోనే పంటనష్టానికి ఎకరానికి పదివేలు ప్రకటించిన ఘనత సీఎం రేవంత్‌రెడ్డిదేనన్నారు. ఫసల్‌బీమా యోజన కింద కాంగ్రెస్ ప్రభుత్వం రైతులకు పంటబీమా ఇచ్చేందుకు 90 రోజుల్లోనే ఒప్పందం చేసుకుందని తెలిపారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ జిల్లా అధ్యక్షుడు ముప్ప గంగారెడ్డి, సిరికొండ గంగారెడ్డి, మహేందర్‌రెడ్డి, శశిధర్‌రెడ్డి, బుచ్చిరెడ్డి పాల్గొన్నారు.

నిజామాబాద్ లీగల్, మార్చి 22 : ఓ మహిళను హత్య చేసి ఆమె ఒంటిపై ఉన్న బంగారు ఆభరణాలను దొంగతనం చేసిన నేరానికి నలుగురికి యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ నిజామాబాద్ జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల శుక్రవారం తీర్పు చెప్పారు. వివరాల్లోకి వెళితే.. ఆర్మూర్‌లోని మామిడిపల్లి గ్రామానికి చెందిన తోకల చిత్ర అనే మహిళ అనారోగ్యంతో బాధపడుతుండేది. తన అనారోగ్యానికి ఇంటి ఎదుట ఉన్న ఓ మహిళ చేతబడి చేస్తుందనే అనుమానం పెంచుకుంది. తన బంధువులైన బట్టు వెంకటేశ్, అతని స్నేహితుడు పందిర్ల రాజేంద ర్‌గౌడ్, బట్టు రంజిత్‌లతో కలిసి పథకం పన్ని 8-7-2018 నాడు మృతురాలి ఇంట్లోకి చొరబడి హత్య చేశారు. ఆ తర్వాత మృతురాలి మెడలో ఉన్న బంగారు ఆభరణాలను ఎత్తుకెళ్లి దోపిడి దొంగలు హత్య చేసినట్లుగా సృష్టించే ప్రయత్నం చేశారు. అప్పటి ఏసీపీ రవికుమార్ అనుమానితుల వేలిముద్రలు, సీసీ ఫుటేజీల ఆధారంగా వీరందరినీ అదుపులోకి తీసుకుని.. ఐపీసీ 302, 379 కింద కేసు నమోదు చేశారు. విచారణ అనంతరం నలుగురు నిందితులకు యావజ్జీవ కారాగార శిక్ష విధిస్తూ న్యాయాధికారి సునీత శుక్రవారం తీర్పునిచ్చారు.



మచ్చర్ల వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఏసీపీ బస్వారెడ్డి

క్యాన్సర్ నిర్మూలనకు కృషి చేయాలి

ఆర్మూర్ రూరల్, మార్చి 22: క్యాన్సర్ వ్యాధి నిర్మూలనకు ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆర్మూర్ ఏసీపీ బస్వారెడ్డి అన్నారు. శుక్రవారం ఆలూర్ మండలంలోని మచ్చర్ల గ్రామంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ సహకారంతో ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ బస్వారెడ్డి మాట్లాడుతూ క్యాన్సర్‌పై వస్తున్న అపోహలను ప్రజలు నమ్మవద్దన్నారు. సరైన, స్వచ్ఛమైన ఆహారం తీసుకోవడం వల్ల క్యాన్సర్ వ్యాధిని దూరం చేయవచ్చన్నారు. క్యాన్సర్‌పై ఉన్న నమ్మకాలు, భయాందోళనకు గురవుతున్న ప్రజలకు తాము అండగా ఉంటామని, ప్రజా సంఘాల ఆధ్వర్యంలో గ్రేస్ క్యాన్సర్ ఫౌండేషన్ వారు ఉచిత వైద్య శిబిరాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. శిబిరంలో క్యాన్సర్ పరీక్ష, వివిధ రకాల క్యాన్సర్‌ల నిర్ధారణ పరీక్షలు ఉచితంగా చేయడం వల్ల పేద ప్రజలకు ఆర్థిక బారం తక్కుతుందని అన్నారు. ఏఐపీకెఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ మాట్లాడుతూ క్యాన్సర్ వ్యాధి పట్ల ప్రభుత్వం ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. క్యాన్సర రోగులకు వైద్యాన్ని అందుబాటులోకి తీసుకువచ్చి ప్రభుత్వాలు ఉచితంగా అందజేయాలని, క్యాన్సర్‌పై ప్రత్యేక దృష్టి సారించాలని క్యాన్సర్ రోగాన్ని తరిమికొట్టాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ పస్క. నర్సయ్య, ఏఐపీకెఎస్ రాష్ట్ర కార్యదర్శి దేవరాం, వీడీసీచైర్మన్ రాజ్‌కుమార్, కోశాధికారి అమృత్; మాజీసర్పంచ్ జి.నర్సయ్య, డాక్టర్ అశోక్, డాక్టర్ రమేష్, ప్రజా సంఘాల నాయకులు కిషన్, ఆకుల గంగారాం, మచ్చర్ల రాజన్న, అనిల్, నరేందర్, తదితరులు పాల్గొన్నారు.

ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

ఆర్మూర్ టౌన్, మార్చి 22: పట్టణంలో బార్ అసోసియేషన్‌లో శుక్రవారం ఏకగ్రీవంగా బార్ అసోసియేషన్ కమిటీని ఎన్నుకున్నారని ఎన్నికల అధికారులు గరడి ఆనంద్, తాళ్ల శ్రీనివాసులు తెలిపారు. బార్ అసోసియేషన్ అధ్యక్షునిగా తెడ్డు నర్సయ్య, ఉపాధ్యక్షుడిగా పోడేటి శంకర్, ప్రధానకార్యదర్శిగా దేవరశెట్టి అరుణ్, సంయుక్త కార్యదర్శిగా సిందుకర్ చరణ్, కోశాధికారిగా తుమ్మ సుకేష్, గ్రంథాలయ కార్యదర్శి సూర సురేష్‌లను ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఎన్నికైన వారిని న్యాయవాదులు అభినందించారు. ఈ కార్యక్రమంలో న్యాయవాదులు తులసీదాస్ క్రాంతి, కృష్ణపండిత్, చిల్క. కిష్టయ్య, కృష్ణంరాజు, ఐనరి అశోక్, ప్రవీన్‌కుమార్, కోనేరు, మధు, తదితరులు పాల్గొన్నారు.

గవర్నర్ ఆదేశించినా.. తీరని కష్టాలు!

- తెలంగాణ యూనివర్సిటీలో బాలికల హాస్టల్‌లో వసతుల కరువు
- ఇరుకుగా మారిన హాస్టల్
- ఒకే భవనంలో 500మందికి వసతి
- 300 మందికి సరేపోయే భవనంలో విద్యార్థినులకు తప్పని తిప్పలు



టీయూలో దాదాపు 500 మంది విద్యార్థినులు ఉంటున్న బాలికల హాస్టల్ ఇదే..

డిచ్‌పల్లి, మార్చి 22: రాష్ట్ర అవతరణకు ముందే ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం పేరుతో ఉన్న ఏకైక యూనివర్సిటీ డిచ్‌పల్లిలోని తెలంగాణ యూనివర్సిటీ. ఇంత ఘనమైన పేరున్న ఈ విశ్వవిద్యాలయంలో బాలికలకు తీవ్రమైన వసతి ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రం అవతరించి 10ఏళ్లు గడిచి, రెండో ప్రభుత్వం కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చినా.. వర్సిటీలో బాలికల వసతి సమస్య నేటికీ తీరాడం లేదు. ఎన్నో సార్లు ప్రభుత్వానికి, ప్రజాప్రతినిధులకు, రాష్ట్ర గవర్నర్‌కు వినతి పత్రాలు విద్యార్థులు అందించినా.. సమస్య పరిష్కారం కావడం లేదు. రూరల్ శాసన సభ్యుడు డా. భూపతిరెడ్డి, స్థానిక బాలికల వసతి గృహం పట్ల ప్రత్యేకచొరవ చూపి నిధులు మంజూరు చేసేలా కృషి చేయాలని హాస్టల్ విద్యార్థినులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు. తెలంగాణ యూనివర్సిటీ అభివృద్ధిపై నిజామాబాద్ అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ గుప్తా ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ సమావేశాల్లో ప్రస్తావించారు. ఇక్కడి సమస్యలు తీర్చాలని, వెంటనే టీయూ కు నిధులు కేటాయించి వర్సిటీ అభివృద్ధికి ప్రభుత్వం చొరవ చూపాలని కోరారు. అయిన నేటికి ప్రభుత్వం కనీసం స్పదించలేదు. రాష్ట్రంలోని వివిధ జిల్లాల నుంచి విద్యార్థినులు ఇక్కడికి పీజీ, ఉన్నత చదువుల కోసం వస్తుంటారు. గత ఐదు సంవత్సరాలుగా ఈ హాస్టల్ సమస్య తీవ్రంగా వేధిస్తున్నా.. ప్రభుత్వ పెద్దలు, ఉన్నత విద్యా మండలి స్పందించకపోవడంతో విద్యార్థినులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. పీజీ కోర్సుల్లో అన్ని విభాగాల్లో విద్యార్థినులే అధిక శాతం సీట్లు వంద శాతం సీట్లలో 72 మంది విద్యార్థినులే సీట్లు సాధిస్తున్నారు. దీంతో వర్సిటీలోని బాలికల హస్టల్ లోని ఒక్కో గదిలో 5నుంచి ఆరుగురు ఉండాల్సి ఉండగా.. 10 నుంచి 15మంది సర్దుబాటు చేసుకుంటున్నారు. గత విద్యా సంవత్సరంలో తెలంగాణ యూనివర్సిటీలో 1,851 మంది విద్యార్థులు పీజీ కోర్సుల్లో చేరగా 1,226 మంది బాలికలు పీజీ కోర్సులో ప్రవేశం పొందారు. గతంలో ఎన్నడూ లేని ఈ విధంగా పీజీ కోర్సుల్లో అమ్మాయిలు ఎక్కువగా చేరుతుండటంతో హాస్టల్ అకాంబిడేషన్ ఇబ్బందిగా మారింది. దీంతో యూనివర్సిటీ అధికారులు సెల్ఫ్ ఫైనాన్స్ కోర్సులో చేరే విద్యార్థులకు హాస్టల్ వసతి కల్పించకుండా ఒత్తిడిని తగ్గించే ప్రయత్నం చేస్తున్నారు. గత పదేళ్ల క్రితం 300 మంది కోసం కట్టిన బాలికల హాస్టల్‌లో ప్రస్తుతం 500 మంది ఉండటంతో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కెమిస్ట్రీ, తెలుగు, ఇతర డిపార్టుమెంట్‌లలో 30 నుంచి 60 సీట్లకు పెంచిన హాస్టల్ వసతి మాత్రం పెంచడం లేదని, దీంతో సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయని విద్యార్థినులు వాపోతున్నారు.

ఒకే భవనంతో తీవ్ర ఇబ్బందులు

గతంలో విశ్వవిద్యాలయానికి రాష్ట్ర గవర్నర్ తమిళిసై సౌందరరాజన్ సందర్శించిన సమయంలో విద్యార్థినులు, బాలికల హాస్టల్ ఏర్పాటు చేయాలని, ఒకే హాస్టల్‌తో తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని, ఆమెకు తమ గోడు వెళ్లబోసుకున్నారు. వెంటనే సమస్య పరిష్కరించేందుకు స్వయంగా హాస్టల్ సందర్శించిన గవర్నర్ హామీ ఇచ్చి సంవత్సర కాలం దాటినా.. ఇంత వరకు హాస్టల్ వసతి నిర్మాణానికి చిల్లిగవ్వ కూడా ప్రభుత్వం మంజూరు చేయాలేదు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చింది. స్థానిక ఎమ్మెల్యే సైతం కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి కావడంతో, ఇప్పటికైన తమ సమస్యలను ప్రభుత్వ దృష్టికి సీఎం, మంత్రుల తెలియజేసి హాస్టల్ నిర్మాణానికి నిధులు మంజూరు చేసేలా స్థానిక ఎమ్మెల్యే డా.భూపతిరెడ్డి కృషి చేయాలని విద్యార్థినులు వేడుకుంటున్నారు.

పోషక ఆహారాన్ని తప్పక తీసుకోవాలి



మాట్లాడుతున్న జిల్లా అధికారిణి రసూల్‌బీ

- పోషణ పక్షోత్సవాల్లో జిల్లా అధికారిణి రసూల్‌బీ

ఆర్మూర్ టౌన్, మార్చి 22: ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా అందజేసే పోషకాలతో కూడిన ఆహారాన్ని గర్భిణీలు, పిల్లలు, బాలింతలు క్రమం తప్పకుండా తీసుకోవాలని జిల్లా అధికారిణి రసూల్‌బీ అన్నారు. శుక్రవారం పట్టణంలోని జెండగల్లీలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో భాగంగా అంగన్‌వాడి కేంద్రాల టీచర్‌లు, గర్భిణీలు చిన్న పిల్లల తల్లులకు పౌష్టికాహారంపై ఆమె అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా జిల్లా అధికారిణి రసూల్‌బీ మాట్లాడుతూ బాలింతలు, గర్భిణులు తాజా ఆకు కూరలు, సిరి ధాన్యాలు తప్పకుండా తీసుకోవాలని, ఆరోగ్యంగా ఉంటారన్నారు. అనంతరం గర్భిణులకు సీమంతాలు నిర్వహించారు. ఇందులో మున్సిపల్ కమిషనర్ రాజు, సానిటరీ ఇన్స్‌పెక్టర్ మహేష్, ఎన్వీరల్‌మెంట్ ఇంజనీర్ పూర్ణమౌళి, సీడీపీవో పద్మభార్గవి, ఏసీడీపీవో జ్యోతి, సూపర్‌వైజర్ నళిని, అంగన్‌వాడీ టీచర్‌లు లక్ష్మీ, పద్మ, తదితరులున్నారు.

జాతీయస్థాయి షూటింగ్ బాల్ పోటీలకు పల్లికొండ విద్యార్థులు

భీమ్‌గల్ రూరల్, మార్చి22: భీమ్‌గల్ మండలంలోని పల్లికొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తొమ్మిదవ తరగతి విద్యార్థులు గీతిక, సంజన, బాలకృష్ణ అనే ముగ్గురు మహబూబాబాద్ తొర్రూరులో జరిగిన టోర్నీలో అత్యంత ప్రతిభ కనబరిచారు. ఈనెల 28 నుంచి 31 వరకు ఘజియాబాద్ ఉత్తరప్రదేశ్ లో జరిగే జాతీయస్థాయి సబ్ జూనియర్ షూటింగ్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు పాఠశాల వ్యాయామ ఉపాధ్యాయులు రమేష్ గౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా పాఠశాల ఉపాధ్యాయ బృందం విద్యార్థులను అభినందించారు.

రాష్ట్ర సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

డిచ్‌పల్లి, మార్చి 22: రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు మిట్టపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి భూక్య దేవేందర్ ఎంపికయ్యాడని వ్యాయామ ఉపాధ్యాయుడు గంగామోహన్ తెలిపారు. విద్యార్థి దేవేందర్‌ను శుక్రవారం పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు సుశీల్ కుమార్, ఉపాధ్యాయుల బృందం అభినందించారు. ఈనెల 11న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్మూర్‌లో జరిగిన జిల్లా సబ్‌జూనియర్ జట్టు ఎంపికలో దేవేందర్ పాల్గొని ప్రతిభ కనబరి ఈనెల 23 నుంచి 24 వరకు యాదాద్రి జిల్లా అలేరులో జరగనున్న రాష్ట్ర సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని గంగామోహన్ తెలిపారు. రాష్ట్రస్థాయిలో ప్రతిభ చూపి అవార్డు తేవాలని ఆ కాంక్షించారు. ఇందులో హెచ్‌ఎం సుశీల్ కుమార్, రాజశేఖర్, రాఘవేందర్, పోశెట్టి, బాలరాజు, నిరంజన్, శ్రీధర్‌లు అభినందించారు.

'నాసిరకం ఎరువులపై విచారణ చేపట్టాలి'

ఆర్మూర్ రూరల్, మార్చి 22: పెర్కిట్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో రైతులకు పంపిణీ చేసిన నాసిరకం ఎరువుల పంపిణీపై విచారణ జరిపించాలని డైరెక్టర్‌లు డిమాండ్ చేశారు. శుక్రవారం పెర్కిట్ సొసైటీలో సమావేశమైన డైరెక్టర్‌లు నాసిరకం ఎరువులు రైతులకు పంపిణీ చేయడం పట్ల రైతులు నష్టపోయారని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అధిక కమిషన్‌ల కోసం నాసిరకం ఎరువులను సరఫరా చేశారని ఆరోపించారు. సొసైటీ చైర్మన్ బోజారెడ్డి మాట్లాడుతూ రైతులకు ఎరువులు సరఫరా చేసే మార్క్‌ఫెడ్ సంస్థ నుంచి సకాలంలో ఎరువులు రాకపోవడంతో అగ్రిమార్ట్ నుంచి ఎరువులను కొనుగోలు చేసి రైతులకు అందజేశామన్నారు. వ్యవసాయాధికారుల సూచన మేరకు ఆ ఎరువులను నిలిపివేశామన్నారు. ఎరువుల పంపిణీలో తాము ఎలాంటి అవకతవకలకు పాల్పడలేదని, ప్రతీ రశీదును భద్రంగా ఉంచామని ఈ విషయమై జిల్లా సహకార అధికారి, జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో విచారణ జరపాలని కోరారు.

ఆలూర్ సొసైటీలో సర్వసభ్య సమావేశం

ఆర్మూర్ రూరల్, మార్చి 22: ఆలూర్ ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో శుక్రవారం చైర్మన్ తంబురి శ్రీనివాస్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం ఆదాయ వ్యయాల నివేదికను సీఈవో మల్లేష్ చదివి వినిపించారు. సొసైటీ ద్వారా రైతులకు అందజేసే పంట రుణాలను రూ.2లక్షల వరకు పెంచాలని సమావేశంలో తీర్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ చేపూర్ రాజేశ్వర్, డైరెక్టర్‌లు కల్లెం బోజారెడ్డి, గోవర్ధన్, సంతోష్‌రెడ్డి, కల్లెం సాయిరెడ్డి, కట్ట నర్సయ్య, ఆరే రాజేశ్వర్, ప్రమోద్, వెల్మ నర్సారెడ్డి, మల్లుబాయి, పచ్చుల లస్మబాయి, సొసైటీ సిబ్బంది పాల్గొన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు

జక్రాన్‌పల్లి, మార్చి 22: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను వేశారు. శుక్రవారం గ్రామంలో సుమారు 899 పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలు వేసినట్లు పశు వైద్యాధికారిణి డాక్టర్ శిరీష తెలిపారు. ఈ కార్యక్రమంలో గోపాలమిత్ర రాజ్‌కుమార్, పశువైద్యసిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

'జయంతి ఉత్సవాలు నిర్వహించాలి'

ముప్కాల్, మార్చి 22: ఏప్రిల్ 1 మొదటి నుంచి అంబేద్కర్ జయంతి వరకు ఉత్సవాలు నిర్వహించాలని తాపస్ జిల్లా ఉపాధ్యాయ సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఒడ్నాల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలకేంద్రంలోని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఉమ్మడి బాల్కొండ మండల శాఖ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు నిర్వహిం చాలని అన్నారు. ఇందులో బాల్కొండ మండల కార్యదర్శి మగ్గిడి రాజేందర్, రాజ్యలక్ష్మీ, మండల అధ్యక్షుడు సుంకం రవికుమార్, మెండోర మండల అధ్యక్షురాలు రమాదేవి, జ్యోతి, విజయానంద్, తదితరులు పాల్గొన్నారు.



రైలు పట్టాలు మార్పు చేసేందుకు వచ్చిన కూలీలు

రైల్వే పాత పట్టాల తొలగింపు

- కొత్త పట్టాల బిగింపు కోసం ప్రారంభమైన పనులు

డిచ్‌పల్లి, మార్చి 22: రైల్వే ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు గత 30 ఏళ్ల క్రితం వేసిన రైల్వే పట్టాల స్థానంలో నూతన రైల్వే పట్టాలు వేసేందుకు శుక్రవారం ప్రత్యేక రైలులో రైలు పట్టాలను తీసుకొచ్చి పట్టాల పక్కన కూలీలతో పనులు ప్రారంభించారు. ఆర్‌అండ్‌బీ రోడ్డుపై రెండు వైపుల రైల్వే గేటు వేసి వాహన రాకపోకాలను నిలిపివేసి పట్టాలను వేసుకుంటు ముందుకు సాగారు. గతంలో బిగించిన పట్టాలు 13 మీటర్లు మాత్రమే ఉండేవని, ప్రస్తుతం 200 మీటర్ల పోడువైన ఇనుప ట్రాక్‌లను ఏర్పాటు చేస్తున్నామని రైల్వే అధికారి తెలిపారు. రైలు పట్టాలు బిగించేందుకు వచ్చిన వాహనంలో 50మంది కూలీలు ఇనుప చైనుల సహాయంతో ట్రాక్ పక్కన పట్టాలను దింపుతున్నారు. నూతన ఏర్పాటు పట్టాల ఏర్పాటుతో ఒక గంట పాటు రోడ్డుకు రెండు వైపుల వాహనాలను నిలిపివేయడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.

'పిల్లల్లో సృజనాత్మకతను వెలికితీయాలి'

ముప్కాల్, మార్చి 22: ప్రతీ విద్యార్థిలో ఏదో ఒక కళ ఉంటుందని, దానిని వెలికితీసి పిల్లల అభివృద్ధికి తోడ్పాడాలంటు ప్రముఖ సైకార్టిస్టు మోటివేషనల్ స్పికర్ జిఎవి.కుమార్ అన్నారు. శుక్రవారం ముప్కాల్ మండల కేంద్రంలోని కృష్ణవేణి ఉన్నత పాఠశాలలో పిల్లల పెంపకం ఒక కళ అనే అంశంపై నిర్వహించిన సేమినార్‌లో విద్యార్థిని తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా పిల్లల పెంపకంపై తల్లిదండ్రులకు వివరించారు. విద్యార్థి అభివృద్ధిలో తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాత్ర ఎంతో ఉందని సూచించారు. ఈ కారయక్రమంలో కృష్ణవేణి పాఠశాల జోనల్ ఇన్‌చార్జీ శేఖర్‌రెడ్డి, పాఠశాల ప్రిన్సిపాల్ కోట ప్రవీన్, పాఠశాల వైస్‌ప్రిన్సిపాల్ రాజేందర్, డైరెక్టర్‌లు ధర్మపురి, నర్సయ్య, రాజేందర్, పాఠశాల ఉపాధ్యాయ బృందం, విద్యార్థుల తల్లిదండ్రులు పాల్గొన్నారు.

'నీటి ప్రవాహ ప్రాంతాల్లోకి వెళ్లొద్దు'

ముప్కాల్, మార్చి22: రానున్న హోలీ పండగ సందర్భంగా యువకులు, పిల్లలు సమన్వయం పాటించి నీటి ప్రవాహక ప్రాంతంలోకి వెళ్ళవద్దని ఎస్సై బాస్కరచారి సూచించారు. హోలీ పండగ సందర్భంగా పాఠశాలలకు సెలవులలో విద్యార్థులు కాలువలు గాని, డ్యామ్ పరిసర ప్రాంతల్లో వెళ్లవద్దని సూచించారు. యువకులు హోలీ పండగను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని, ఏలాంటి అవాంచనీయ జరగకుండా చూడాలన్నారు. మద్యం మత్తులో నీటి ప్రవాహక ప్రాంతాల్లోకి వెళ్ళవద్దని ద్యార్థుల తల్లిదండ్రులు పిల్లలను గమనిస్తూ ఉండాలని ఎస్సై సూచించారు.

ఓటు హక్కుపై అవగాహన

ఆర్మూర్ టౌన్, మార్చి 22: పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న ప్రైమరీ పాఠశాలలో తహసీల్దార్ కె.గజానన్ శుక్రవారం బీఎల్‌వో, మెప్మా ఆర్‌పీలకు ఓటు హక్కుపై అవగాహన కల్పించారు. రాబోవు పార్లమెంట్ ఎన్నికల్లో పోలింగ్ శాతం పెంచేందుకు ప్రతీఒక్కరు కృషి చేయాలని, గత ఎన్నికల్లో తక్కువగా నమోదైన పోలింగ్ శాతాన్ని పెంచేలా ప్రతీ ఇంటికి వెళ్ళి ఓటర్లకు అవగాహన కల్పించాలని అన్నారు. క్యాక్రమంలో ఎంపీడీవో సాయిరాం, ఎన్నికల డీటీ పద్మ, ఆర్ఐ అశోక్‌సింగ్, మెప్మా టీఎంసీ ఉదయశ్రీ, బీఎల్‌వోలు, ఆర్‌పీలు, తదితరులు పాల్గొన్నారు.

బ్రాహ్మణ్‌పల్లిలో ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం

జక్రాన్‌పల్లి, మార్చి 22: మండలంలోని బ్రహ్మణ్‌పల్లి గ్రామంలో సాంఘీక సంక్షేమ ఆర్మూర్ మహిళ గురుకుల డిగ్రీ కళాశాల ఆధ్వర్యంలో శుక్రవారం ఎన్‌ఎస్‌ఎస్ శిబిరం కొనసాగుతోంది. మన గుడి-మన బడి కార్యక్రమంలో భాగంగా గుడి, బడి ప్రాంగణాలను శుభ్రం చేశారు. ప్రపంచ నీటి దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులకు నీటి యొక్క ప్రాధాన్యతను వివరించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌ఎస్‌ఎస్ ప్రోగ్రాం అధికారిణి కె.చైతన్య శాంతి, ప్రోగ్రాం సభ్యులు భవిత, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.



టీయూలో బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేస్తున్న విద్యార్థినులు

నూతన బాలికల హాస్టల్‌ను నిర్మించాలి

- బాలికల హాస్టల్ ఎదుట ఏబీవీపీ ధర్నా

డిచ్‌పల్లి, మార్చి 22: అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ ఆధ్వర్యంలో, తెలంగాణ వర్సిటీలో నూతన బాలికల హాస్టల్ నిర్మించాలని విద్యార్థినులతో కలిసి శుక్రవారం బాలికల హాస్టల్ ఎదుట ఆందోళన చేశారు. వర్సిటీ ఏబీవీపీ అధ్యక్షుడు సాయికుమార్ మాట్లాడుతూ.. వర్సిటీలో బాలికల వసతి గృహంలో ఎన్నో ఇబ్బందులు పడుతున్నారని, ఒక్కో గదిలో 10 మంది విద్యార్థినులు ఉంటున్నారని, ఇరుకుగా మారడంతో అవస్థలు పడుతున్నారని తెలిపారు. గదుల్లో ఎక్కువ మంది విద్యార్థినులు ఉండటంతో ఆనారోగ్య సమస్యలు వస్తున్నాయని, ప్రభుత్వం వెంటనే చొరవ చూపి నూతన బాలికల వసతి గృహం నిర్మించాలని డిమాండ్ చేశారు. విశ్వవిద్యాలయంలో బాలికలకు పీఈటీ లేకపోవడంతో క్రీడలకు దూరం అవుతున్నారని వసతి గృహంలో తాగు నీరు కోరత ఏర్పాడుతుందని, అధికారులకు చెప్పిన పట్టించుకోవడం లేదన్నారు. వెంటనే బాలికల హాస్టల్ సమస్యతో పాటు మౌలిక సదుపాయాలు కల్పించాలని డిమాండ్ చేశారు. ఇందులో అమృత్, పావని, అనిల్, మణి, మహర్షి, పాల్గొన్నారు.

ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ పరీక్షల ఫీజు గడువు పొడిగింపు

డిచ్‌పల్లి, మార్చి 22: తెలంగాణ యూనివర్సిటీ అనుబంధ కళాశాలల పరిధిలోని ఎంబీఏ. ఎంసీఏ, ఐఎంబీఏ, 10 వసెమిస్టర్ రెగ్యూలర్, బ్యాక్‌లాగ్ పరీక్షలకు సంబంధించిన పరీక్షల ఫీజు అపరాధ రుసుముతో పొడగించినట్లు సీవోఈ ప్రొ.అరుణ తెలిపారు. ఫీజు చెల్లించెందుకు చివరి తేదీ ఏప్రిల్ 1 వరకు ఉండగా, 100రూ. అపరాధ రుసుముతో ఏప్రిల్ 4 వరకు, ఫీజు చెల్లించేందుకు ఆవకాశం ఉందన్నారు. ఎంబీఏ, ఎంసీఏ, ఐఎంబీఏ, ఒక్కో సబ్జెక్టు కు 250రూ.కాగ, రెండు సబ్జెక్టుల కంటే ఎక్కువగా ఉంటే 800రూ. చెల్లించాలని సీవోఈ తెలిపారు. పూర్తి సమాచారం కోసం తెలంగాణ యూనివర్సిటీ వెబ్‌సైట్ చూడలన్నారు.

కిరణ్ మృతి తీరని లోటు : ఐఎఫ్‌టీయూ

కమ్మర్‌పల్లి, మార్చి 22: భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) రాష్ట్ర నాయకుడు తెలంగాణ ప్రగతశీల ఆటోవర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు మాస్‌లైన్(ప్రజాపంథ) నాయకుడు కిరణ్ మృతి విప్లవ కార్మికోద్యమానికి తీరని లోటని బలమైన విప్లవకార్మికోద్యమ నిర్మాణమే ఆయనకు నిజమైన నివాళిఅని భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఐఎఫ్‌టీయూ) జిల్లా సహాయ కార్యదర్శి ఆర్ రమేష్, ఉపాధ్యక్షురాలు సత్తెక్క అన్నారు. కమ్మర్‌పల్లిలోని మండల పార్టీ కార్యాలయంలో శుక్రవారం కామ్రెడ్ కిరణ్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతు ప్రజల్లో కార్మిక రంగం కలిసిపోతూ యూనియన్ చురుకైన పాత్ర పోషించారణి కొనియాడుతూ ఆయన సేవల్ని గుర్తు చేశారు. మలిదశ తెలంగాణ ఉద్య మంలో ఆర్టీసీ కార్మికుల పోరాటంలో ఆయన ముఖ్యపాత్ర పోషించారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ (ప్రజాపంథ), ఐఎఫ్‌టీయూ, ఏఐపికేఎస్, ఏఐపికేఎంమ్మెస్ డివిజన్, మండల నాయకులు పాల్గొన్నారు.

మహిళలపై దాడులను ప్రతిఘటిద్దాం

- పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు

మోర్తాడ్, మార్చి 22: దేశంలో మోదీ అనుసరిస్తున్న మతోన్మాద ఫాసిస్టు విధానాలకు వ్యతిరేకంగా పోరాడుదామని ప్రగతి శీల మహిళ సంఘం జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి పిలుపునిచ్చారు. శుక్రవారం మండల కేంద్రంలో పీవోడబ్ల్యు మండల కమిటీ సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. సమాజంలో అన్ని వర్గాల మహిళల పట్ల తీవ్ర వివక్షత, పురుష దుహంకారదాడులు కొనసాగుతూ పురుషాధిపత్యం రాజ్యం మేలుతుందని పోరాడాలని అన్నారు. దేశంలో పేద, దళిత, ఆదివాసి మైనారిటీ స్త్రీలపై దోపిడి అణిచివేత, లైంగికదాడులు, వరకట్న దురాచారాలు, ప్రేమపేరుతో జరిగే దాడులు పెరిగిపోతున్నాయని అన్నారు. అన్ని రకాల హింసాలకు వ్యతిరేకంగా మహిళలు ఉద్యమించాల్సిన అవసరం ఉందని అన్నారు. రైతు కార్మిక, ప్రజావ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న బీజేపీకి వ్యతిరేకంగా పోరాడాలని పీవోడబ్ల్యు పిలుపు నిస్తుందన్నారు. ఇందులో జిల్లా ఉపాధ్యక్షురాలు సత్తెమ్మ, మాస్‌లైన్ ప్రజాపంథా నాయకులు డి.అశోక్, జి.కిషన్, యమున, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీవోడబ్ల్యు జిల్లా అధ్యక్షురాలు వి.గోదావరి

మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలి

● కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు

నిజామాబాద్ అర్బన్, మార్చి 22: మహిళలు ఆత్మస్థైర్యంతో ముందుకు సాగాలని కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు సూచించారు. వివిధ ప్రభుత్వ శాఖలలో పురుష ఉద్యోగులతో సమానంగా ఏమాత్రం తక్కువ కాకుండా మహిళా ఉద్యోగులు సైతం సమర్థవంతంగా విధులు నిర్వహిస్తూ ఉత్తమ సేవలు అందిస్తున్నారని ఆయన అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని టీఎన్‌జీవోస్ ఆధ్వర్యంలో కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉత్తమ సేవలు అందించిన మహిళా ఉద్యోగుల ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ మహిళా ఉద్యోగులు విధులను నిర్వహిస్తూనే మరోపక్క ఇంటిపనులు, కుటుంబ బాధ్యతలు చక్కబెడుతున్నారని తమ ఇంటిని చక్కదిద్దినట్లు సమాజమార్పుకు కూడా మహిళలు దోహదపడాలని అన్నారు. సమాజంలో ఇంకా మహిళల పట్ల వివక్షత కనిపిస్తుందని ఇది దూరం కావాలంటే మహిళలే కీలకపాత్ర పోషించాలన్నారు. మహిళల భద్రతా విషయంలో రాజీపడే ప్రసక్తే లేదని, ఇబ్బందులు ఎదురైతే ఉన్నతాధికారుల దృష్టికి తేవాలన్నారు. కార్యక్రమంలో టీఎన్‌జీవో కేంద్ర సంఘం అధ్యక్షుడు జగదీశ్, కార్యదర్శి నాగరాజు, జిల్లా అధ్యక్షుడు కిషన్, కార్యదర్శి శేఖర్ పాల్గొన్నారు.


మహిళలను సన్మానిస్తున్న కలెక్టర్, తదితరులు

వ్యవసాయ మార్కెట్‌కు హోలీ పండుగ సెలవు

ఖిల్లా, మార్చి 22: ఈనెల 25, 26 తేదీల్లో హోలీ పండుగను పురస్కరించుకొని వ్యవసాయ మార్కెట్ యార్డులో పసుపు క్రయ విక్రయాలు ఉండవని రైతులు దీనిని దృష్టిలో పెట్టుకొని యార్డుకు పసుపును తీసుకురావద్దని సెలక్షన్ గ్రేడ్ కార్యదర్శి వెంకటేశం తెలిపారు. అదేవిధంగా మార్చి 31 వార్షిక ముగింపు లెక్కలు ఉండటం వల్ల 29, 31 తేదీల్లో మార్కెట్ యార్డులో వ్యాపార లావాదేవీలు నిలిపివేస్తున్నట్లు తెలిపారు. 27, 28 తేదీల్లో మాత్రం వ్యాపార లావాదేవీలు జరుగుతాయని తెలిపారు. రైతులు ఈ తేదీలను దృష్టిలో పెట్టుకొని మార్కెట్ యార్డుకు పసుపును తీసుకొని రావద్దని సోమవారం 1 ఏప్రిల్ నాడు వ్యాపార లావాదేవీలు యదావిధిగా కొనసాగుతాయని ఆయన తెలిపారు.


గుండారంలో నిర్వహించిన ఎన్ఎస్ఎస్ శిబిరంలో వలంటీర్లు

గుండారంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

నిజామాబాద్ రూరల్, మార్చి 22: రూరల్ మండలం గుండారంలో ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం నిర్వహించారు. వారం రోజులుగా నగరంలోని ప్రభుత్వ గిరిరాజ్ కళాశాల యునిట్-3కి చెందిన 50 మంది విద్యార్థినులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్‌గా ఉన్న కళాశాల కెమెస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సునీత పర్యవేక్షణలో విద్యార్థినులు గ్రామస్థులకు పరిశుభ్రత, ఆన్‌లైన్ మోసాలపై అవగాహన, ఇంకుడు గుంతల ఆవశ్యకత, ఓటుహక్కు ప్రాధాన్యం వంటి పలు అంశాలను వివరించినట్లు ప్రోగ్రామ్ ఆఫీసర్ డాక్టర్ సునీత తెలిపారు. నగర జీవితం గడుపుతున్న విద్యార్థినులకు గ్రామీణవాతావరణం, స్వచ్ఛమైన ప్రజలు, గ్రామ పాలన వంటి అంశాలు స్వయంగా పరిశీలించే అవకాశాన్ని విద్యార్థినులు సద్వినియోగంచేసుకున్నారని తెలిపారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి


కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న అధికారులు

బోధన్‌రూరల్, మార్చి 22: ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని డీసీవో రవీందర్ అన్నారు. శుక్రవారం బోధన్ సహకార సంఘం ఆధ్వర్యంలో చిన్నమావంది గ్రామంలో పొద్దు తిరుగుడు పంట కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు ప్రభుత్వ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని, దళారులకు విక్రయించి మోసపోవద్దన్నారు. క్వింటాలుకు 6760 మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని స్పష్టం చేశారు. ప్రభుత్వం నిబంధనల మేరకు కొనుగోలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. రైతులు వారి పట్టాపాసు బుక్‌లు, ఆధార్ కార్డు, బ్యాంక్ అకౌంట్ బుక్ జిరాక్స్‌లను అధికారులకు ఇవ్వాలన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ సీఈవో ఉమాకాంత్, రైతులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలి


పోషణ్ పక్వాడ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు, అంగన్‌వాడీలు

నవీపేట,మార్చి 22: అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారాన్ని సక్రమంగా అందించాలని ఇన్‌చార్జి సీడీపీవో స్వర్ణలత కోరారు. శుక్రవారం మండల కేంద్రంలోని రైతు వేదికలో ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న స్వర్ణలత మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాలలో చిన్నారులకు పౌష్టికాహారం అందించడంతో పాటు ఆటపాటలతో విద్యబుద్దులు చెప్పడం జరుగుతుందన్నారు. అలాగే గర్భిణీలు, బాలింతలకు అంగన్‌వాడీ కేంద్రాలలో పౌష్టికాహారాన్ని అందించడం జరుగుతుందని అన్నారు. ఆకు కూరలు, కాయకూరలను శుభ్రంగా కడిగిన తర్వాతే కోయాలని దీని ద్వారా పోషకాలు కోల్పోకుండా ఉంటాయని ఆమె పేర్కొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, భోజనం చేసే ముందు చేతులను శుభ్రంగా కడుక్కోవాలని ఆమె సూచించారు. ఈ సందర్భంగా మిల్లెట్లతో ఏర్పాటు చేసిన బతుకమ్మతో పాటు పౌష్టికాహారాన్ని అందించే వివిధ రకాల కూరగాయలు, ఆకు కూరలు, పప్పుదినుసులను ప్రదర్శించారు. అనంతరం గర్భిణీ స్త్రీలకు సామూహిక సీమంతం చేయడంతో పాటు 5 మాసాలు నిండిన చిన్నారులకు అన్నప్రాసన నిర్వహించారు. ఈ సందర్భంగా చిన్నారులు నిర్వహించిన నృత్యాలు అందరిని ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ఆర్‌బీఎస్‌కే మెడికల్ ఆఫీసర్ అరవింద్, ఏపీఎం భూమేష్ గౌడ్, ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు భాగ్యలక్ష్మి, రాధా లక్ష్మి, మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన అంగన్‌వాడీ టీచర్లు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మాల కార్పొరేషన్‌కు రూ.1000 కోట్లు కేటాయించాలి

సిరికొండ, మార్చి 22: తెలంగాణ ప్రభుత్వం మాల సామాజిక అభివృద్ధి కోసం ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయడం అభినందనీయమని, తెలంగాణ మాల మహానాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ తలారి హేమంత్ అన్నారు. మాల కార్పొరేషన్‌కు రూ.1000కోట్లు కేటాయించాలని వారు కోరారు. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి, డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కలకు ధన్యవాదలు తెలిపారు. ఈ సమావేశంలో మాల మహానాడు ప్రతినిధులు ములుగు రాజేశ్వర్, లక్కం సురేశ్, సుమన్, సుంకరి రాకేశ్, మాద హరిశ్, నిఖిల్, గంగారం పాల్గొన్నారు.

చట్టాలపై రూపొందించిన లఘుచిత్రం అద్భుతమైన కళాఖండం

● జిల్లా న్యాయాధికారి సునీత కుంచాల

నిజామాబాద్ లీగల్, మార్చి 22: చట్టాలపై రూపొందించిన లఘుచిత్రం అద్భుతమైన కళాఖండమని జిల్లా ప్రధాన న్యాయమూర్తి సునీత కుంచాల అన్నారు. శుక్రవారం నగరంలోని ఆర్‌ఆర్ చౌరస్తా వద్ద ఉషామల్టీప్లెక్స్ షోలో జిల్లా ప్రధాన న్యాయమూర్తి, న్యాయసేవా సంస్థ చైర్‌పర్సన్ సునీత కుంచాల మాట్లాడుతూ సమాజంలో అందరి జీవనహక్కులను గౌరవిస్తూ గౌరవ ప్రదమైన జీవన గమనాన్ని కొనసాగించాలని ఆమె తెలిపారు. అనంతరం కలెక్టర్ రాజీవ్‌గాంధీ హన్మంతు, పోలీస్ కమీషనర్ కల్మేశ్వర్‌లు మాట్లాడుతూ వివాహాల నిరోధక చట్టం, సైబర్ క్రైమ్, తదితర చట్టాలపై న్యాయసేవా సంస్థ రూపొందించిన లఘుచిత్రం చాలా అద్భుతమని వీటి వల్ల ప్రజలకు ఎంతో అవగాహన కలుగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో న్యాయసేవా సంస్థ కార్యదర్శి సీనియర్ సివిల్ జడ్జి పద్మావతి, సీనియర్, జూనియర్ సివిల్ జడ్జిలు, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు దేవదాస్ చందక్, తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

బోధన్ ఆఫీసర్స్ క్లబ్‌పై దాడి

● 22 మందిపై కేసు నమోదు

బోధన్ రూరల్, మార్చి 22: బోధన్ ఆఫీసర్స్ క్లబ్‌పై శుక్రవారం రాత్రి టాస్క్‌ఫోర్స్ పోలీసులు అకస్మికంగా దాడి నిర్వహించారు. ఆఫీసర్స్ క్లబ్‌లో పేకాట ఆడుతున్న 22 మందిని అదుపులోకి తీసుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పట్టణ సిఐ వీరయ్య మాట్లాడుతూ 22 మందిపై కేసు నమోదు చేసి, పేకాట స్థావరంలో 24 వేల 500 వందల రూపాలయలనుస్వాధీనం చేసుకున్నట్లు ఆయన వివరించారు.

ఇసుక టిప్పర్ పట్టివేత

బోధన్‌రూరల్, మార్చి 22: అక్రమంగా ఇసుక రవాణా చేస్తున్న ఇసుక టిప్పర్‌ను పట్టుకున్నామని రూరల్ ఎస్ఐ నాగనాథ్ తెలిపారు. శుక్రవారం హంగర్గ, కొప్పర్గ గ్రామాల శివారు నుండి అక్రమంగా ఎటువంటి అనుమతి పత్రాలు లేకుండా ఇసుక రవాణా చేస్తున్న టిప్పర్‌ను పట్టుకుని కేసు నమోదు చేశామన్నారు. ఎవరైనా అక్రమ ఇసుక రవాణా చేస్తే వాహనాలు సీజ్ చేయబడతాయని, కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

ఎడపల్లి: మండలంలోని బాహునగర్ గ్రామ సమీపాన శుక్రవారం అక్రమంగా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్‌ను పోలీసులు పట్టుకున్నారు. అతని దగ్గర ఎలాంటి పత్రాలు లేకపోవడంతో ట్రాక్టర్‌ను పోలీస్ స్టేషన్‌కు తరలించినట్లు ఎస్సై వంశీ కృష్ణారెడ్డి తెలిపారు. అక్రమంగా ఇసుక, మొరం తరలిస్తే కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

కామ్రేడ్ వడ్లకొండ కిరణ్‌కు ఘన నివాళులు


బోధన్ అంబేద్కర్ చౌరస్తాలో నివాళులు అర్పిస్తున్న దృశ్యం

బోధన్‌రూరల్, మార్చి 22: బోధన్ పట్టణంలోని అంబేద్కర్ చౌరస్తాలో శుక్రవారం కామ్రేడ్ కిరణ్ కుమార్ మృతి పట్ల ఆయన చిత్రపటానికి ఐఎఫ్‌టీయూ ఆధ్వర్యంలో పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మల్లేష్ మాట్లాడుతూ కామ్రేడ్ కిరణ్ ప్రగతిశీల ఆటో డర్కర్స్ యూనియన్ హైదరాబాద్ ప్రధాన కార్యదర్శిగా ఉంటూ ఆటో మోటార్ కార్మికుల కోసం అనేక ఉద్యమాలు చేశారని, ఆయన చేసిన ఉద్యమాలను వివరించారు. కార్మికుల సంక్షేమం కోసం నిరంతరం పోరాటాలు చేశారని, తెలంగాణ ఉద్యమ సమయంలో కీలకపాత్ర పోషించారని, జైలు జీవితం గడిపారని అన్నారు. ఆయన మృతి పట్ల తీవ్ర సంతాపాన్ని తెలియజేశారు. ఈకార్యక్రమంలో ప్రగతిశీల రైతు సంఘం జిల్లా నాయకులు పడాల శంకర్, పీవోడబ్ల్యూ పట్టణ అధ్యక్షులు బి.నాగమణి, ఎం.శాంతబాయి, నాయకులు అర్షద్ పాషా, ఖాజా, నవీన్, శ్రీనివాస్, రాము, గంగాధర్, షజీద్‌లతో ఆటో కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

కిరణ్ మృతి కార్మిక వర్గానికి తీరనిలోటు..

పెద్దబజార్: ఐఎఫ్‌టీయూ రాష్ట్ర నాయకుడు, ప్రోగ్రెసివ్ ఆటో అండ్ మోటార్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు వడ్లకొండ కిరణ్ మృతి కార్మిక వర్గానికి తీరనిలోటని ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు నరేందర్ అన్నారు. శుక్రవారం నగరంలోని కోటగల్లిలో గల ఎన్‌ఆర్ భవన్‌లో కిరణ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కిరణ్ అనేక కార్మిక ఉద్యమాల్లో ప్రజాఉద్యమాల్లో తెలంగాణ ఉద్యమాల్లో చురుకైన పాత్ర పోషించారని అన్నారు. ఆటోరంగ కార్మికుల సమస్యలపై నిరంత రం పోరాడుతూ హైదరాబాద్ ఆటోరంగ కార్మికులతో పాటు రాష్ట్రవ్యా ప్త ఆటోరంగ కార్మికులకు అండగా నిలిచారన్నారు. కిరణ్ క్యాన్సర్ వ్యాధి తో అర్థాంతరంగా మృతి చెందడం బాధాకరమన్నారు. శనివారం ఎన్‌ఆర్ భవన్‌లో క్యాన్సర్ వ్యాధిపై ఉచిత శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఐఎఫ్‌టీయూ నాయకులు సుధాకర్, ముత్తెన్న, రాజేశ్వర్, సాయాగౌడ్, సంధ్యారాణి, మురళి, రాజేశ్వర్ పాల్గొన్నారు.

బెల్టు షాప్‌పై దాడి

రెంజల్, మార్చి22: మండల కేంద్రంలో ఎటువంటి అనుమతులు లేకుండా మద్యం విక్రయిస్తున్న కొండ శేఖర్‌కు చెందిన కిరాణ షాప్‌లో సోదా చేయగా 4,422రూపాయల మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేయడం జరిగిందని ఎస్ఐ సాయన్న తెలిపారు. ఎటువంటి అనుమతులు లేకుండా అధిక ధరలకు విక్రయిస్తున్నా మద్యం దుకాణాలపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు.

మట్కా ఆడితే కఠిన చర్యలు

బోధన్‌రూరల్, మార్చి 22: మట్కా, జూదం ఆడితే కఠిన చర్యలు తప్పవని బోధన్ పట్టణ సీఐ వీరయ్య అన్నారు. శుక్రవారం బోధన్ పట్టణంలోని పాత బస్టాండ్‌లో మట్కా నిర్వహిస్తున్న ముజాయిద్దీన్‌ను జిల్లా టాస్క్‌ఫోర్స్ అధికారులు పట్టుకున్నారని పేర్కొన్నారు. మట్కా నిర్వాహకుడిపై కేసు నమోదు చేశామన్నారు. బోధన్‌లో ఎవరైనా మట్కా, జూదం ఆడిన కఠిన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉపాధి హామీ కూలీల సంఖ్యను పెంచాలి

● నర్సరీలో మొక్కలను సరైన విధంగా పెంచాలి
● డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

బోధన్‌రూరల్,మార్చి22: ఉపాధి హామీ పనులలో కూలీలను పెంచాలని డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం బోధన్ మండల పరిషత్ కార్యాలయ సమావేశపు మందిరంలో పంచాయతీ కార్యదర్శులు, ఉపాధి హామీ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గ్రామాల్లోని నర్సరీలలో మొక్కలను సరైన విధంగా పెంచాలని సూచనలు చేశారు. ఉపాధి హామీలో వేసవిలో ఇబ్బందులు కలగకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. అనంతరం మండలంలోని బెల్లాల్‌లో నర్సరీలను పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్ యాదవ్, ఎంపీవో మధుకర్, ఈసీ అల్తాఫ్, డీఆర్‌డీఏ సిబ్బంది ఓంపాల్‌లతో ఉపాధి హామీ సిబ్బంది, ఫీల్డ్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు తదితరులున్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ సాయాగౌడ్

మొక్కలకు నీటి కొరత లేకుండా చూడాలి..

ఎడపల్లి: ఎండాకాలంలో నాటిన మొక్కలకు, నర్సరీలలో నీటి కొరత లేకుండా చూడాలని డిఆర్‌డిఓ పిడి సాయాగౌడ్ అన్నారు. శుక్రవారం ఎడపల్లి మండలంలోని కుర్నాపల్లి, రాణాకలాన్ గ్రామాలలోని నర్సరీలను పరిశీలించి రాణాకలాన్‌లోని అలీసాగర్ ఉద్యాన వనం వద్ద ఏర్పాటు చేసిన సంపద వనంలో నాటిన మొక్కలను పరిశీలించారు. అనంతరం ఎడపల్లి మండల కేంద్రంలోని ఇబ్రహింపూర్ శివారులో చేపడుతున్న ఉపాధి హామీ పనులను పరిశీలించి, ఉపాధీ కూలీలతో మాట్లాడారు. ఎండా కాలంలో ఉపాధి పనులు చేస్తున్నపుడు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఉపాధి కూలీలకు సూచించారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట డిఆర్‌డిఓ ఏపిడి ఓంపాల్, ఎంపిడిఓ గోపాలకృష్ణ, ఏపీఓ శ్రీవాణీ, పంచాయితీ కార్యదర్శులు హేమ, బండి నర్సయ్య, టీఏలు జ్యోతి, జ్యోతి, ఎఫ్ఏ సుచరిత తదితరులు ఉన్నారు.

'బేటీ పడావో.. బేటీ బచావో' పై చిత్రప్రదర్శన

రెంజల్, మార్చి 22: బేటీ పడావో.. బేటీ బచావో కార్యక్రమంలో భాగంగా మహిళా శిశు దివ్యాంగులు, వయోవృద్ధుల శాఖ మహిళ సాధికారిత కేంద్రం ఆధ్వర్యంలో బేటీ బచావో.. బేటీ పడావో కార్యక్రమ ప్రణాళికపై శుక్రవారం వీరన్నగుట్ట గ్రామంలో చిత్ర ప్రదర్శన ద్వారా గ్రామంలో బాల్య వివాహాలు, మహిళలపై అహింస, అరాచకాలు, లింగ వివక్షతపై చిత్రపదర్శన ద్వారా అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బీఆర్‌బీ కోఆర్డినేటర్ విజయ లక్ష్మి, మహిళ సాధికారిత జిల్లా సమన్వయకర్త స్వప్న, సూపర్‌వైజర్ ప్రమీలా రాణి మాట్లాడుతూ గ్రామాలలో మహిళలపై జరుగుతున్న అరాచకాలు, లింగ వివక్ష, బాల్య వివాహలపై అవగాహన కల్పించేందుకు మహిళ శిశు సంక్షేమ శాఖ ద్వారా గ్రామాలలో చిత్ర ప్రదర్శన నిర్వహించడం జరిగిందని పేర్కొన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ ఉపాధ్యాయులు విజయలక్ష్మి, శాంత, జిల్లా సాధికారిత సిబ్బంది, ఐసీడీఎస్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సబ్‌స్టేషన్ ఆపరేటర్ సస్పెన్షన్

సుభాష్‌నగర్, మార్చి 22: నందిపేట మండలం కుదావంద్‌పూర్ సబ్‌స్టేషన్ ఆపరేటర్ మోహన్‌ను సస్పెండ్ చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు. గత కొన్ని రోజులుగా సబ్‌స్టేషన్‌లో ప్రైవేటు ఆపరేటర్‌ను నియమించి విధులకు దుమ్మా కొడుతున్న మోహన్‌ను సస్పెండ్ చేస్తూ విద్యుత్ శాఖ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. గత రెండు రోజుల క్రితం విద్యుత్ శాఖ అధికారులు తనిఖీ నిమిత్తం వెళ్లగా విధుల్లో లేకపోవడంతో మోహన్‌ను సస్పెండ్ చేశారు.

సీఎంను కలిసిన ఆగ్రోస్ చైర్మన్

కోటగిరి, మార్చి22: సీఎం రేవంత్ రెడ్డిని ఆయన నివాసంలో ఆగ్రోస్ ఇండస్ట్రీస్ చైర్మన్ కాసుల బాలరాజు రాష్ట్ర ప్రభుత్వ సలహాదారుడు షబ్బీర్ అలీతో కలిసి మర్యాదపూర్వకంగా కలిశారు. సీఎంకు పుష్పగుచ్చం ఇచ్చి కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో కార్పొరేషన్ చైర్మన్ మోహన్ రెడ్డి, ఎంపీటీసీ కొట్టం మనోహర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

బీజేపీ గెలుపునకు కృషి చేయాలి

నవీపేట, మార్చి 22: రాబోయే పార్లమెంటు ఎన్నికలలో బీజేపీ గెలుపునకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎంపీ అర్వింద్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రఘుపతిరెడ్డి గార్డెన్స్‌లో నవీపేట, రెంజల్ మండలాలకు చెందిన శక్తి కేంద్ర ఇన్‌చార్జిలు, బూత్ అధ్యక్షులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ సారథ్యంలో దేశం అన్ని రంగాలలో అభివృద్ధి పథంలోకి దూసుకెళ్తుందని వచ్చే పార్లమెంట్ ఎన్నికలలో బీజేపీ 400స్థానాలకు పైగా గెలుపొందడం ఖాయమని ఆయన ధీమా వ్యక్తం చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు దినేష్ కులాచారి, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు మోహన్ రెడ్డి, మేడపాటి ప్రకాష్ రెడ్డి పాల్గొన్నారు.

వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలి

నవీపేట, మార్చి 22: గ్రామ పంచాయతీలలో వందశాతం ఇంటి పన్నులను వసూలు చేయాలని నిజామాబాద్ డీఎల్‌పీవో శ్రీనివాస్ కోరారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇంటి పన్నుల వసూళ్లలో వెనుకబడిన మండలంలోని 7 గ్రామాల పంచాయతీ కార్యదర్శులతో ఆయన మాట్లాడారు. ఈ నెలాఖరులోగా వందశాతం పన్నులు వసూలు చేయాలని, పన్నుల వసూలులో వెనుకబడిన వారిపై చర్యలు ఉంటాయని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో నాగనాథ్, ఎంపీవో రామకృష్ణ తదితరులున్నారు.

యూనివర్సిటీ అడ్మిషన్స్‌కు 31 వరకు అవకాశం

నిజామాబాద్ అర్బన్, మార్చి 22: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓపెన్ యూనివర్సిటీలో డిగ్రీ, పీజీ కోర్సుల్లో అడ్మిషన్స్ పొందేందుకు రూ.200 అపరాద రుసుముతో ఈనెల 31 వరకు అవకాశం ఉందని రీజినల్ కోఆర్డినేటర్ రంజిత ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలకు 7382929612 నెంబర్‌కు సంప్రదించాలని ఆమె తెలిపారు.

ముగ్గురు కార్యదర్శుల బదిలీ

కోటగిరి, మార్చి22: కోటగిరి ఉమ్మడి మండలంలో ముగ్గురు పంచాయతీ కార్యదర్శులను డిప్యూటేషన్‌పై బదిలీపై చేసినట్లు ఎంపీడీవో మనోహర్ రెడ్డి తెలిపారు. పొతంగల్ పంచాయతీ కార్యదర్శిగా పని చేస్తున్న వాగ్మారే యాదు అడ్కాస్‌పల్లికి బదిలీ అయ్యారు. అడ్కాస్‌పల్లి కార్యదర్శిగా పని చేస్తున్న క్యాతప్ప కారేగాంకు బదిలీ కాగా కారేగాంలో పని చేస్తున్న చంద్రకాంత్ పొతంగల్ పంచాయతీ కార్యదర్శిగా బదిలీ అయ్యారు. పొతంగల్ పంచాయతీ కార్యదర్శి చంద్రకాంత్‌ను గ్రామస్థులు సన్మానించారు. బదిలీపై వెళ్లిన యాదును గ్రామస్థులు సన్మానించారు.

మూల్యాంకనంలో భాషా పండితులకు స్థానం కల్పించాలి

నిజామాబాద్ అర్బన్, మార్చి 22: పదో తరగతి మూల్యాంకనంలో భాషాపండితులకు స్థానం కల్పించాలని రాష్ట్రీయ ఉపాధ్యాయ పండిత పరిషత్ ప్రతినిధులు శుక్రవారం డీఈవో దుర్గాప్రసాద్‌కు వినతిపత్రం అందజేశారు. డీఈవోను కలిసిన వారిలో అధ్యక్షుడు జమీలుల్లా, ప్రధానకార్యదర్శి రమణాచారి, ఉన్నారు.

మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు

ఖిల్లా, మార్చి 22: మద్యం తాగి వాహనం నడిపిన ముగ్గురికి జైలు శిక్ష విధించినట్లు ట్రాఫిక్ ఏసీపీ ఎ.నారాయణ తెలిపారు. మద్యం తాగి వాహనాలు నడుపుతున్న పది మందిని ట్రాఫిక్ ఇన్స్‌పెక్టర్ వెంకటనారాయణ గుర్తించి వారికి కౌన్సిలింగ్ నిర్వహించారు. అనంతరం శుక్రవారం ఉదయం కోర్టులో హాజరుపర్చగా ఏడుగురికి 7,300 జరిమానా విధించారు. ముగ్గురు వ్యక్తుల్లో ఇద్దరికి మూడు రోజుల చొప్పున, మరొక వ్యక్తికి నాలుగు రోజుల జైలు శిక్షను విధించినట్లు తెలిపారు. జైలుశిక్ష పడిన వారిలో బచ్చాల నాగరాజు, మొగులూరి వెంకటేశ్వర్లు, లక్కరాజుకు నాలుగు రోజులు శిక్ష విధిస్తూ మెజిస్ట్రేట్ సయ్యద్ ఖదీర్ ఆదేశం ఇచ్చారు.

సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి విద్యార్థి

సిరికొండ, మార్చి 22 రాష్ట్ర సబ్ జూనియర్ సాఫ్ట్‌బాల్ పోటీలకు చీమన్‌పల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాల విద్యార్థి మాలవత్ నితిన్ ఎంపిక య్యాడని వ్యాయమ ఉపాధ్యాయుడు నవీన్ తెలిపారు. ఈ నెల 11న సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల ఆర్మూర్‌లో జరిగిన జిల్లా సబ్ జూనియర్ జట్టు ఎంపికలో నితిన్ పాల్గొని ప్రతిభ కనబర్చి ఈ నెల 23 నుంచి 24 వరకు యాదాద్రి జిల్లా అలేరులో జరగనున్న రాష్ట్ర సబ్ జూనియర్ పోటీల్లో పాల్గొంటారని పీఈటీ తెలిపారు.

చికెన్ ధరలు

రకం	లైవ్	విత్‌స్కిన్	స్కిన్‌లెస్
సుగుణ (కిలో)	రూ.155	రూ.225	రూ. 265
వెన్‌కాబ్(కిలో)	రూ.160	రూ.235	రూ. 275

బంగారం ధరలు

బిస్కెట్ (10 గ్రా.)	ఆర్నమెంట్(10 గ్రా.)	వెండి(10 గ్రా.)
రూ.68,000	రూ.62,700	రూ.785

సినిమా గైడ్ నిజామాబాద్

పీవీఆర్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓం భీమ్ భుష్ (12.40, 3.50, 7.00, 10.10)
స్క్రీన్-2 : ప్రేమలు (1.30)
: కుంగుఫూ పాండా4 (ఇంగ్లీష్ 3డీ) (5.10, 7.30)
: సైతాన్ (హిందీ) (9.50)
స్క్రీన్-3 : సైతాన్ (హిందీ) (12.45)
: యోధా (హిందీ) (3.45)
: ప్రేమలు (6.45)
: లైన్‌మెన్ (10.00)
స్క్రీన్-4 : రజాకర్ (12.05, 6.30, 9.45)
: గామి (3.20)

ఉషాప్రసాద్ మల్టీప్లెక్స్..

స్క్రీన్-1 : ఓం భీమ్ భుష్ (11.00, 1.45, 4.50, 7.30, 10.30)
స్క్రీన్-2 : లైన్‌మెన్ (1.40)
: ప్రేమలు (4.30, 10.30)
: భీమా (7.40)
స్క్రీన్-3 : రజాకర్ (10.30, 1.35, 4.35, 10.40)
: లైన్‌మెన్ (7.45)

దేవి : ప్రేమలు (11.15, 2.15, 6.15, 9.15)
లలితమహాల్ : ఓం భీమ్ భుష్ (11.15, 2.15, 6.15 9.15)
నటరాజ్ : నువ్వు నేను (11.15, 2.15, 6.15, 9.15)
విజయ్ : రజాకర్ (11.15, 2.15, 6.15, 9.15)

- నిజామాబాద్ అర్బన్